సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం ၊ 25 ၊ నవంబర్ ၊ 2024



నైపుణ్యాల పెంపునకు.. 8లో


విద్యార్థులను ఆంగ్లం, గణితంలో తీర్చిదిద్దేందుకు 'సాక్షి' మీడియా గ్రూప్ ఆదివారం నిర్వహించిన స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్, మ్యాథ్‌బీ సెమీ ఫైనల్స్‌కు విశేష స్పందన లభించింది.



సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే..

పాఠశాల క్రీడా సమాఖ్య అండర్‌-19 విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులు సొంత ఖర్చులతో హాజరు కావాల్సిన దుస్థితి నెలకొంది. - 8లో

17వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 3,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం వద్ద భక్తులు

అయినవిల్లి: కార్తిక మాసం ఆదివారం కావడంతో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ పూజలు నిర్వహించారు. స్వామికి మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 99 మంది, పంచామృతాభిషేకాల్లో ఆరుగురు దంపతులు, లక్ష్మీగణపతి హోమంలో 23 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 21 మంది చిన్నారులకు తులాభారం, 21 మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. స్వామివారి అన్నదాన పథకంలో 5,420 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.4,02,986 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

రేబిస్ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



వీధి కుక్కకు రేబిస్ నిరోధక టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది, పక్కన జిల్లా అధికారులు

అమలాపురం టౌన్: పశువుల నుంచి సంక్రమించే రేబిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు సూచించారు. కుక్కలకు ముందుగానే రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. స్థానిక సావరం పశు వైద్యశాల వద్ద కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, జంతు ప్రేమికురాలు, న్యాయవాది శాంతి కమల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత సావరం ప్రాంతంలో వీధి కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని పశు వైద్యశాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ పట్టణంలోని పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కలకు కూడా యాంటీ రేబిస్ టీకాలు విధిగా వేయించాలని సూచించారు. పెంపుడు కుక్కలకు వాటి యజమానులు, వీధి కుక్కలకు స్థానికులు వేయించే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 60 వీధి కుక్కలకు టీకాలు వేశామన్నారు. పశు వైద్యులు వాసవి, వెంకటేష్, హేమచంద్ర, సందీప్, గౌరీశంకర్, కళాశాల విద్యార్థులు ఉదయ్, మహేష్ , తేజ తదితరులు సేవలు అందించారు.

కార్మిక నేత గళ్లా రాము మృతి



గళ్లా రాము (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కార్మిక సంఘాల నేత గళ్లా రాము (68) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శనివారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందారు. దాదాపు 40 ఏళ్లుగా ఆయన కార్మికుల హక్కులు, వారి సంక్షేమం కోసం పలు సంఘాల అధ్యక్షుడిగా, కార్మిక ఉద్యమ నేతగా పనిచేశారు. పలు ప్రభుత్వాలపై కార్మికుల హక్కుల కోసం పోరాడి ఫలితాలు సాధించారు. 1993లో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు సన్నిహితుడిగా ఉండి టీఎన్‌టీయూసీ నేతగా దాదాపు రెండు దశాబ్దాల పాటు పనిచేశారు. తర్వాత కొబ్బరి కార్మికుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా దశాబ్దానికి పైగా పనిచేసి వారి హక్కుల కోసం పోరాడారు. కార్మిక అనుబంధంగా పనిచేసే పలు సంఘాలకు రాము గౌరవాధ్యక్షునిగా కొనసాగారు. మాజీ లోక్‌సభాపతి దివంగత జీఎంసీ బాలయోగి సిఫార్సులతో 2000లో రైల్వే యూజర్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన ఫైళ్లు, వినతి పత్రాలు తయారు చేసి కార్మికులతో కలసి ఆయా ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు అందిస్తూ నిత్యం కార్మిక హక్కుల కోసమే పరితపించేవారు. గత ఆరు నెలలుగా రాము క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లు చేశారు. రాము మృతి పట్ల జిల్లాకు చెందిన కార్మిక సంఘాల నేతలు సంతాపం తెలిపారు. రాము మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కుయ్ కుయ్.. కూత రాదోయ్

- నేడు చలో విజయవాడకు పిలుపు
- చర్చలు విఫలమైతే రాత్రి నుంచే సేవల బంద్
- డిమాండ్లు పరిష్కరించక సిబ్బంది అసంతృప్తి

అలమూరు: ఆపదలో సంజీవని.. క్షతగాత్రులకు ప్రాణప్రదాయిని.. అందరి సంక్షేమకారిణి.. అత్యవసర వైద్య సేవల్లో రోగులు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సరైన సమయానికి ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రాణాపాయం తప్పిస్తున్న 108 అంబులెన్స్ అర్ధాంతరంగా ఆగిపోనుంది. ప్రమాద స్థలికి కుయ్ కుయ్‌మంటూ వచ్చే ఆ వాహనం మూగబోనుంది. దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై విసుగుపోయిన సిబ్బంది ఈ నిర్ణయానికి వచ్చారు. ఈ అంబులెన్స్‌లను ప్రభుత్వమే నిర్వహించాలంటూ నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. వివిధ మండలాల్లో దశల వారీగా తహసీల్దార్లకు వినతి పత్రాలను అందజేయడంతో పాటు ఈ నెల 18న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. అయినా కూటమి ప్రభుత్వం నుంచి ఏవిధమైన స్పందన రాకపోవడంతో ఈ నెల 25 నుంచి దీర్ఘకాలిక సమ్మెలోకి దిగాలని భావించారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. అత్యవసర సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టేందుకు రాష్ట్ర 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ సోమవారం చలో విజయవాడకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం చర్చలకు పిలిచి తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందిస్తే సమ్మె విషయమై పునరాలోచన చేస్తామని, లేకుంటే రాత్రి నుంచే 108 సేవలు నిలిపివేస్తామని ఉద్యోగులు చెబుతున్నారు. ఇదే క్రమంలో చలో విజయవాడను అడ్డుకునేందుకు ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేస్తోంది. విజయవాడకు వెళ్లే ప్రయత్నం విరమించుకోవాలని పోలీసు యంత్రాంగం 108 ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఎందుకింత వివక్ష

రేయింబవళ్లు విధి నిర్వహణే పరమావధిగా అత్యవసర సేవలు అందిస్తూ అనేక మందికి పునర్జన్మ



అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

ఇస్తూ ఆపద్బాంధవులుగా ఖ్యాతి గాంచిన 108 అంబులెన్స్ సిబ్బందిపై ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత విధానంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వాహనంలో ఒక్కో ఉద్యోగి 12 గంటలకు పైగా పనిచేయాల్సి వస్తోంది. సిబ్బంది కొరత కారణంగా ఉన్న ఉద్యోగులకు వారాంతపు సెలవులు తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. గత మూడు నెలల నుంచి ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ వాహనాల్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉండటంతో విధుల్లో ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడుతుంది. దీర్ఘకాలికంగా ఉన్న తమ డిమాండ్లను నెరవేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్న వినతిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగడం అనివార్యమైందనే ఉద్యోగులు చెబుతున్నారు. ఈ అంబులెన్స్‌లను నిర్వహిస్తున్న అరబిందో ఫార్మాను తప్పించాల్సిన పరిస్థితులు తలెత్తితే సత్వరమే ఉద్యోగులు అనేక రాయితీలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ఉద్యోగి ఏకకాలంలో ఒక సంస్థలో ఐదేళ్లు పనిచేస్తే గ్రాట్యుటీ చెల్లించాలి. అయితే గత ప్రభుత్వంలో 108 వాహన నిర్వహణ బాధ్యతను 2020 జూలై 1న ప్రారంభించారు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం అరబిందో ఫార్మా నిర్వహణను రద్దు చేస్తే ఐదేళ్ల కాలపరిమితి పూర్తవ్వడానికి అవకాశం లేకుండా పోతుంది. దీనివల్ల తమకు అందాల్సిన గ్రాట్యుటీ నష్టపోతామని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ నిర్వహణ సంస్థ అరబిందో ఫార్మాను తప్పించాల్సి వస్తే తమకు గ్రాట్యుటీని ప్రభుత్వమే పూర్తిగా చెల్లించడంతో పాటు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ పరిధిలోకి 108 వాహన సేవలను విలీనం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నా పట్టించుకోకపోవడంపై నిరవధిక సమ్మె చేపట్టేందుకు ఉద్యోగులు నిర్ణయించుకున్నారు.



108 వాహనంలో మహిళకు ప్రసవం చేసిన ఈఎంటీ

సేవలు ఆగితే అంతే..

దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారం కోరుతూ 108 ఉద్యోగులు సమ్మె ప్రారంభిస్తే అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. క్షేత్ర స్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించే వీరు సేవలను నిలిపివేస్తే పరిస్థితి ఏంటనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. సమ్మె ప్రారంభమైతే జిల్లాలో ప్రమాదాల్లో చిక్కుకున్న వారికి సకాలంలో సేవలు అందని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 108 వాహనాలు 62 ఉన్నాయి. అందులో 116 మంది డ్రైవర్లు, 120 మంది ఎమర్జెన్సీ టెక్నీషియన్ (ఈఎంటీ)లు విధులు నిర్వహిస్తున్నారు. మూడు జిల్లాల్లో ప్రతి నెలా సుమారు 1.50 లక్షల మందికి పైగా రోగులు పలు రకాల వైద్య సేవలు పొందుతున్నారు. తమ సమస్యలకు పరిష్కారం దొరకక తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వస్తోందని ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ చెబుతుంది. ఈ మేరకు 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా స్థాయి మండల స్థాయి అధికారుల వరకూ సమ్మె నోటీసులను ఇప్పటికే అందజేసింది.

కక్షపూరిత వైఖరి సరికాదు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న తమ డిమాండ్లను నెరవేర్చకుంటే నిరవధిక సమ్మె తప్పదని జిల్లా 108 సర్వీస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ హెచ్చరించింది. సమ్మె ప్రయత్నాలను అడ్డుకోవడం, ఉద్యోగులపై కక్షపూరిత వైఖరి అవలంబించడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వంతో చర్చలు విఫలమైతే సోమవారం రాత్రి నుంచే సేవలు నిలిపివేసి ఉద్యోగులంతా సమ్మె చేపడతారని పేర్కొంది.



జిల్లా	108 వాహనాలు	ఈఎంటీలు	డ్రైవర్లు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	22	39	42
తూర్పుగోదావరి	21	38	41
కాకినాడ	19	36	37

అంబులెన్స్‌లో రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

ప్రధాన డిమాండ్లు ఇవే..

- 108 ఉద్యోగులకు ప్రతి నెలా ఐదో తేదీ లోపు క్రమం తప్పకుండా వేతనాలు అందించాలి.
- సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలి. జీఓ నంబర్ 49ను పునరుద్ధరించాలి.
- ఉద్యోగుల సర్వీసును బట్టీ రెగ్యులర్ చేయడంతో పాటు వాహనాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి.
- పైలట్ గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులకు సంబంధించి, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలి.
- వేతన స్లాబ్‌లలో మార్పులు తీసుకురావాలి. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి.
- వేతనంపై 40 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. బకాయిలను వేతనంతో పాటు చెల్లించాలి.
- ఉద్యోగులు ఇప్పటికే ఖర్చు చేసిన ఎలక్ట్రికల్ బిల్లులు, వాహనాల మైనర్ మరమ్మతులు సత్వరమే అందజేయాలి.
- వైద్య, ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి.
- ఈపీఎఫ్‌కు సంబంధించి యాజమాన్య వాటాను యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.
- అంబులెన్స్‌ల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు నూతన నియామకాలు చేపట్టాలి.
- వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి. రికార్డులు సక్రమంగా ఉండేలా చూడడంతో పాటు బీమా పూర్తిగా చెల్లించాలి.
- అంబులెన్స్ సిబ్బంది విధుల్లో మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందజేయాలి. ప్రతి మండల కేంద్రంలో సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలి.

ఘనంగా శెట్టిబలిజ వనసమారాధన

అమలాపురం రూరల్: అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ వన సమారాధన ఆదివారం జరిగింది. ఇందులో పార్టీలకు అతీతంగా శెట్టిబలిజలు పాల్గొని సందడి చేశారు. తొలుత శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వన సమారాధనకు వేలాదిమంది తరలివచ్చి ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు హాజరయ్యారు. శెట్టిబలిజలు ఐక్యంగా ఉంటూ ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీలు అభివృద్ధి సాధించాలంటే దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి అన్నారు. జాతి ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. బీసీలంతా ఐక్యంగా సాగాలని పిలుపునిచ్చారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ సంఘ నాయకుడు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ సంఘ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, గుత్తుల సాయి, కట్టా మల్లేశ్వరరావు, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



శెట్టిబలిజ వన సమారాధనలో సంఘీభావం తెలుపుతున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు

మనుషుల్లో హేతువాద ఆలోచనలు పెరగాలి

అమలాపురం టౌన్: మనుషుల్లో హేతువాద ఆలోచనలు పెరగాలని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘం ఆధ్వర్యంలో అమలాపురంలోని జిల్లా ఎన్జీయూ భవనంలో ఆదివారం జిల్లా మహాసభ జరిగింది. దీనికి వీరన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి సమాజంలో హేతువాద, మానవ వాద ఉద్యమం అవసరమన్నారు. మూఢ విశ్వాసాల్లో ఉన్నవారిని బయటకు తెచ్చి వారిని స్వతంత్ర ఆలోచనాపరులుగా మార్చాలని వీరన్న పేర్కొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ 'హేతు వాదం- వాస్తవికత' అనే అంశంపై ప్రధానంగా జరిగింది. భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ 'మత విశ్వాసాలు- సైన్స్' అనే అంశంపై చర్చించారు. సంఘ ప్రతినిధి రాజశేఖర్ 'హేతుబద్ధ ఆలోచనలు' అనే అంశంపై విశ్లేషించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరన్న రచించిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ధోరణలు' గ్రంథాన్ని సంఘ ప్రతినిధి పి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అలాగే భారత ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రచించిన 'పిల్లల పెంపకం' గ్రంథాన్ని సంఘ ప్రతినిధి తోరాటి వసంతరావు ఆవిష్కరించి సమీక్ష చేశారు. సాహిత్యం ద్వారా హేతువాదంపై భావ విప్లవం తేవాలని వీరన్న పిలుపునిచ్చారు. సంఘ ప్రతినిధులు తోట బాలకృష్ణ, డి.రాజశేఖర్, డి.ప్రకాష్ మాట్లాడుతూ హేతువాదాన్ని బలపరిచే దిశగా పలు అంశాలపై చర్చించారు.



మహాసభలో మాట్లాడుతున్న భారత హేతువాద సంఘ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

- డిసెంబర్ 7న మాలల ఆత్మీయ సమ్మేళనం
- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నేత లోక్

అమలాపురం రూరల్: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లా నుంచి ఉద్యమానికి రూపకల్పన చేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నేత డీబీ లోక్ ప్రకటించారు. దీని కోసం వచ్చే డిసెంబర్ 7న అమలాపురంలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నామని అన్నారు. స్థానిక ఈదరపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో జిల్లా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మాలల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లోక్ మాట్లాడుతూ దళితులను విడదీసే కుట్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా మాలలకు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన మాలల ముఖ్య నాయకులు తమ ప్రసంగాల్లో డిసెంబర్ 7న నిర్వహించే మాలల సమ్మేళనం ద్వారా వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలో రోజు రోజుకూ దళితులపై పెరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు నివారించి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, గెద్దం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు, గొల్లపల్లి డేవిడ్, కోట రామమోహనరావు తదితరులు వర్గీకరణ వ్యతిరేక ఉద్యమ రూపకల్పనపై చర్చించారు. సమావేశంలో దళిత నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఎంఏకే భీమారావు, దేవరపల్లి శాంతికుమార్, కొంకి రాజామణి, నెల్లి లక్ష్మీపతి, కాశి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న డీబీ లోక్

అన్ని దారులూ అన్నవరానికే!



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం : కార్తిక మాస ఆదివారం రత్నగిరి సత్యదేవుని సన్నిధికి భక్తులు పోటెత్తారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సత్యదేవుని ఆలయం, వ్రత మంటపాలు, ఆలయ ప్రాంగణం, ఎక్కడ చూసినా భక్తజనమే దర్శనమిచ్చారు. సత్యదేవుని వ్రతాలు 8,900 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.90 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారన్న అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దీంతో తెల్లవారుజాము నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్రతాలు, దర్శనం సాఫీగా జరిగాయి. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ వ్రత మంటపాల కార్యాలయంలో ఉండి వ్రతాల నిర్వహణ తదితర ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఈఓ రామచంద్రమోహన్ పశ్చిమ రాజగోపురం వద్ద కంపార్ట్‌మెంట్ల వద్ద ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిండిపోయిన పార్కింగ్ స్థలాలు

కార్తికమాసం, ఆదివారం కావడంతో వేలాది వాహనాలలో భక్తులు విచ్చేయడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఆ స్థలాలు సరిపోక సత్యగిరిపై ఘాట్‌రోడ్‌కు రెండువైపులా వాహనాలను నిలిపివేశారు. సుమారు పదివేల వాహనాలలో భక్తులు ఆలయానికి వచ్చుంటారని అంచనా వేస్తున్నారు.

పులిహోర కోసం పెద్ద క్యూ

సాధారణంగా సత్యదేవుని దర్శనానికి, వ్రతాల నిర్వహణ కోసం భక్తులు గంటల తరబడి క్యూ లో నిలబడతారు. కాని, ఆదివారం రామాలయం ఎదురుగా గల సర్క్యులర్ మండపంలో పంపిణీ చేస్తున్న పులిహోర, దద్దోజనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సోమవారం తెల్లవారుజాము ఒంటి గంట నుంచి వ్రతాలు, దర్శనాలు

కార్తికమాసంలో చివరి సోమవారం కావడంతో నేడు రత్నగిరిపై తీవ్ర రద్దీ నెలకొనే అవకాశం ఉంది. ఆదివారం సాయంత్రానికే సుమారు 20 వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. స్వామివారి ఆలయాన్ని సోమవారం తెల్లవారుజామున ఒంటిగంటకు తెరచి వ్రతాలు స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. రత్నగిరిపై వివిధ సత్రాలలో గదులు భక్తులతో నిండిపోయాయి.

ఇప్పటి వరకూ 1,11,566 వ్రతాల నిర్వహణ

ఈ కార్తిక మాసంలో సత్యదేవుని ఇప్పటి వరకు 1,11,566 వ్రతాలు జరిగాయి. సోమవారం మరో పదివేల వ్రతాలు జరిగే అవకాశం ఉంది. కార్తికంలో మిగిలిన ఆరు రోజుల్లో మరో 30 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఏ విద్యార్థికీ హాల్ టిక్కెట్లు నిరాకరించవద్దు



రావిరాల మహేష్ కుమార్, కలెక్టర్

అమలాపురం టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికీ సంబంధిత కళాశాలలు హాల్ టిక్కెట్ నిరాకరించవద్దని జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ సూచించారు. తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు హాజరు కాకుండా నిరోధించవద్దని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితులు కల్పించినా, ఫిర్యాదులు అందినా సంబంధిత కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు, విద్యార్థులకు కళాశాలల నుంచి ఎదురవుతున్న అవరోధాలపై కలెక్టర్ స్పందించి ఈ చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలకు ఫీజులు చెల్లించకపోవడం వల్ల కొంతమంది ఇంజినీరింగ్, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, వారిని పరీక్షలకు రాయనీకపోవడం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హోల్డ్ చేయకూడదని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాయని తెలిపారు. ఎవరైనా కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేస్తే సంబంధిత కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం బకాయి ఫీజులను కళాశాలల అకౌంట్లలోకి త్వరలోనే జమ చేస్తుందన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే జీఓ కూడా విడుదల కానుందని వివరించారు.

అప్పనపల్లి.. భక్తులతో శోభిల్లి

మామిడికుదురు: బాలబాలాజీ స్వామి కొలువైన అప్పనపల్లి క్షేత్రం ఆదివారం కోలాహలంగా మారింది. కార్తిక మాసం ఆదివారం కావడంతో స్వామివారి ఆలయం భక్తులతో నిండిపోయింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు పాత, కొత్త ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. స్వామివారి సన్నిధిలో నిత్య శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.4.14 లక్షలు ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.55,307 విరాళాలుగా వచ్చాయి. 6,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 4,259 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

క్లుప్తంగా

సత్యదేవుని సన్నిధికి మహా పాదయాత్ర


పిఠాపురం నుంచి మహా పాదయాత్ర చేస్తున్న భక్తులు

పిఠాపురం: కార్తికమాసం సందర్భంగా గొల్లప్రోలు బస్టాండ్‌లో దుర్గాదేవి ఆలయం నుంచి అన్నవరం సత్యదేవుని సన్నిధికి ఆదివారం 3,500 మంది భక్తులు మహా పాదయాత్రగా వెళ్లారు. అక్కడ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. కొన్నేళ్లుగా గొల్లప్రోలు నగర పంచాయతీకి చెందిన భక్తులు మహా పాదయాత్ర చేస్తున్నారు. ఏటా వందల మంది భక్తులు కలసి పాదయాత్రగా అన్నవరం సత్యనారాయణ స్వామివారి దర్శనానికి వెళుతుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏకంగా 3,500 మంది మహా పాదయాత్ర నిర్వహించారు. గొల్లప్రోలుకు చెందిన మామిడాల సూరిబాబు, అక్కిరెడ్డి శ్రీను అల్పాహారం, చేబ్రోలు శ్రీసాయి ప్రియ సేవా సమితి వ్యవస్థాపకుడు జ్యోతుల శ్రీనివాస్ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. నమస్తే అన్న యూనియన్ నాయకుడు జ్యోతుల సురేష్ మజ్జిగ, మర్రెడ్డి శ్రీనివాస్ పండ్లు పంపిణీ చేశారు.

లోవలో భక్తుల సందడి


తలుపులమ్మ తల్లి దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు

తుని రూరల్: లోవ తలుపులమ్మ దేవస్థానం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు నాలుగు వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టిక్కెట్లు, కేశఖండన శాల, వసతి గదుల అద్దె, తదితర విభాగాల ద్వారా రూ.2,08,911 ఆదాయం సమకూరిందని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు.

డీజిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ముమ్మిడివరం: యానాం నుంచి ఆటోలో అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. అమలాపురానికి చెందిన కుడిపూడి నరేష్, కేతా శ్రీనివాస్ తన ఆటోలో యానాం నుంచి రూ.80 వేలు విలువైన వెయ్యి లీటర్ల డీజిల్‌ను టిన్నుల్లో తరలిస్తుండగా, కొండాలమ్మ చింత సమీపంలో పట్టుకున్నామని అన్నారు. ఆటోను సీజ్ చేసి, డీజిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నైపుణ్యాల పెంపునకు..


'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థి

SAKSHI SPELL Bee 2024 - 25

- 'సాక్షి' స్పెల్‌బీ, మ్యాథ్‌బీకి విశేష స్పందన
- ట్రిప్స్ స్కూల్లో ఉత్సాహంగా నిర్వహణ
- స్పెల్‌బీ క్వార్టర్, మ్యాథ్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్ష
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల హాజరు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులను ఆంగ్ల భాషలో ప్రావీణ్యులుగా, గణితంలో ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దేందుకు 'సాక్షి' మీడియా గ్రూప్ ఆదివారం నిర్వహించిన స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్, మ్యాథ్‌బీ సెమీ ఫైనల్స్‌కు విశేష స్పందన లభించింది. రాజమహేంద్రవరం త్రిపురనగర్‌లోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్ష రాయించేందుకు అమితాసక్తి చూపారు. 'సాక్షి' స్పెల్‌బీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నాలుగు కేటగిరీలుగా పరీక్షలు నిర్వహించగా, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకూ 'సాక్షి' మ్యాథ్‌బీ నాలుగు కేటగిరీల్లో జరిపారు. మొత్తం 1,020 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులకు, కేటగిరీ–2లో 3, 4 తరగతులకు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతులకు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. 'సాక్షి' స్పెల్‌బీ, మ్యాథ్‌బీ వంటి పరీక్షలు విద్యార్థుల్లో నూతనోత్సవాన్ని నింపుతాయని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి, కాంపిటేటివ్ పరీక్షలకు ఎంతగానో దోహదపడతాయని తల్లిదండ్రులు అన్నారు. ఈ స్పెల్‌బీ, మ్యాథ్‌బీ నిర్వహించిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ బాలాత్రిపురసుందరి, 'సాక్షి' సిబ్బంది పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్‌వేఫీస్, అసోసియేట్ స్పాన్సర్‌గా రాజమహేంద్రవరం ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి.


ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆంగ్లం, గణితంపై పట్టు సాధించవచ్చు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో ఇటువంటి స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్షలు ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది. ఆంగ్లంలో మరింత పరిణితి సాధించడానికి వీలుంటుంది. 'సాక్షి' మ్యాథ్‌బీ పరీక్ష ద్వారా విద్యార్థులు గణితంలో రీజనింగ్, లాజికల్ థింకింగ్‌తో పాటు పోటీతత్వం పెంపొందించడంలో దోహదం చేస్తుంది. గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి ప్రజ్ఞావంతులుగా తయారవుతారు. 'సాక్షి' యాజమాన్యం స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయం.

– బాలా త్రిపురసుందరి, డైరెక్టర్, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమహేంద్రవరం

SAKSHI MATH BEE 2024-25

చాలా ఇంప్రూవ్ అయ్యింది



'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ద్వారా మా అమ్మాయి హిరన్ చాలా ఇంప్రూవ్ అయ్యింది. గత ఏడాది స్పెల్‌బీ ఫైనల్స్‌కు వెళ్లింది. ఈ పరీక్ష రాయడం ద్వారా ఆంగ్లంపై పూర్తి పట్టు వస్తుంది. దీంతో ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడుతుంది. 'సాక్షి' యాజమాన్యం స్పెల్‌బీ, మ్యాథ్‌బీ నిర్వహించడం అభినందనీయం.

– డి.విద్య, ఆదిత్యలక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని తల్లి, కాకినాడ

ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 'సాక్షి' స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. 'సాక్షి' స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్‌లోవకాబులరీ, లాంగ్వేజ్ స్కిల్స్ పెంపొందుతాయి. విద్యార్థులు ఆంగ్ల భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

– డాక్టర్ సంతోష్‌కుమార్, ట్రిప్స్ విద్యార్థిని తండ్రి, రాజమహేంద్రవరం

కొత్త విషయాలు తెలుసుకున్నా..



'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాయడంతో నేను సరికొత్త విషయాలను తెలుసుకున్నారు. స్పెల్లింగ్స్‌తో పాటు, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించేందుకు ఉపయోగపడింది. 'సాక్షి' యాజమాన్యం స్పెల్‌బీ పరీక్ష రాయించి విద్యార్థులను ప్రోత్సహించడం బాగుంది.

– వై.భవ్య, 7వ తరగతి విద్యార్థిని, ఆదిత్య స్కూల్, శ్రీనగర్, కాకినాడ

కాన్ఫిడెన్స్ పెరుగుతోంది



విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు 'సాక్షి' స్పెల్‌బీ ఎంతగానో ఉపయోగపడుతుంది. కొత్త పదాలు నేర్చుకోవడంతో పాటు కాన్ఫిడెన్స్ పెరుగుతోంది. ఇంగ్లిషు భాషపై పట్టు సాధించవచ్చు. నైపుణ్యాలు పెంచుకునేందుకు ఇలాంటి పరీక్షలు ఉపయోగపడతాయి.

– సురేష్ హస్విత్‌కుమార్, 8వ తరగతి విద్యార్థి, ట్రిప్స్ స్కూల్, రాజమహేంద్రవరం

అకడమిక్‌గా కూడా ఉపయోగం



'సాక్షి' స్పెల్‌బీ కాంపిటేషన్ పరంగానే కాక అకడమిక్‌గా కూడా చాలా ఉపయోగపడుతోంది. కాంపిటేషన్ కోసం వందల్లో పదాలు నేర్చుకునే అవకాశం కలిగింది. తద్వారా అకడమిక్‌గా కూడా అన్నివిధాలా సహకారి అయ్యింది.

– చందన ఇష్‌కృత్విక్, 6వ తరగతి విద్యార్థి, లాహోరల్ స్కూల్, రాజమహేంద్రవరం

గణితంపై భయం ఉండదు



గణితం అంటే విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు 'సాక్షి' మ్యాథ్‌బీ దోహదపడుతుంది. ఈ పరీక్షలు పైతరగతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మ్యాథ్‌బీ గణితంపై పట్టు సాధించేందుకు దోహదం చేస్తుంది.

– ఇందిరా ప్రియదర్శిని, విద్యార్థిని తల్లి, రాజమహేంద్రవరం

మ్యాథ్‌బీపై ఆసక్తి..



'సాక్షి' మ్యాథ్‌బీ అంటే ఎంతో ఆసక్తి. పాఠశాల స్థాయిలో ప్రతిభ చూపి సెమీ ఫైనల్స్‌కు ఎంపిక వ్వడం ఎంతో ఉత్సాహంగా ఉంది. గణితంపై భయాన్ని దూరం చేసే విధంగా, మ్యాథ్స్‌బీ పరీక్ష ఒక ప్రాక్టీస్‌లా ఉపయోగపడుతుంది. మా నైపుణ్యాలు పెరుగుతాయి. థాంక్యూ 'సాక్షి'.

– వీబీ అపరాజిత, 10వ తరగతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్, రాజమహేంద్రవరం

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అకాడమీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: టేబుల్ టెన్నిస్ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీ అప్పారెడ్డి అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం టౌన్ హాల్ సమీపంలోని గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో రాజమహేంద్రవరం, దేవరపల్లి, అనపర్తి, కొవ్వూరు ప్రాంతాలకు చెందిన అనేక మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల జట్టులో టి.ప్రభాత్ సాయి, బూర వినయ్ సాయి జోషిత్, మిరియాల చిట్టిబాబు, ఎస్.సూర్యప్రకాష్, లోహిత్ సూర్య ఎంపికయ్యారు. మహిళల జట్టులో గిడుతూరి సిరి పావని, పత్రి శ్రీలక్ష్మి, యండమూరి వైష్ణవిసూర్య, చార్వి ఫల్గుణ్, గిడుతూరి తాన్యశ్రీ ఎంపికయ్యారు. అండర్– 15 బాలుర, బాలికల విభాగంలో పలువురు క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు డిసెంబర్ 20 నుంచి 22 వరకూ కాకినాడలో జరగబోయే అంతర్ జిల్లాల స్టేట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొంటారని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తెలిపారు. ఈ పోటీలు అసోసియేషన్ కోశాధికారి కె.సత్యనారాయణ (బీము), పీవీవీ సత్యనారాయణరావు, ఎస్ఎస్ ఫల్గుణ్, వరద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో 'తూర్పు' విజేత


రగ్బీ పోటీల్లో విజేత తూర్పు జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–17 బాలికల అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రగ్బీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పోటీల నిర్వహణా కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా గుంటూరు, ప్రకాశం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు అందుకున్నాయి. అనంతరం డిసెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు గణేష్, జిల్లా రగ్బీ సంఘ కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, పీడీలు రవిరాజు, సూరిబాబు, నాగు, జి.శ్రీను పాల్గొన్నారు.

ఆత్మహత్య ఘటనపై విచారణ


వివాహిత ఆత్మహత్య చేసుకున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం: అదనపు కట్నం కోసం అత్తమామలు, భర్త ఇబ్బంది పెడుతున్నారని గొల్లప్రోలుకు చెందిన తొగరు రమేష్ భార్య వరుపుల దివ్య (27) ఈ నెల 14న ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసుపై ఆదివారం పోలీసులు విచారణ చేశారు. పెద్దాపురం మండలం చదలవాడ గ్రామానికి చెందిన వరుపుల దివ్య 14న గొల్లప్రోలులో రైలు ఎక్కి మల్లవరం గేటు, దుర్గాడ గ్రామాల మధ్యలో రైలు దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసును తుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తూ కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణుకి బదిలీ చేశారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు అడిషనల్ ఎస్సై లక్ష్మణ స్వామి పరిశీలించారు.

సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే..

- అండర్–19 విభాగ క్రీడాకారుల పరిస్థితి
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు అవస్థలు


కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్-19 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీ (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19 విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులు సొంత ఖర్చులతో హాజరు కావాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం అండర్–19 విభాగంలో క్రీడాకారులకు ఒక్క రూపాయి కూడా అందించక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విభాగంలో దాదాపు 40 క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించి ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు జిల్లా జట్లను నిర్వాహకులు పంపిస్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీల కొరత కారణంగా పోటీల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖకు అప్పగించింది. పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17, 19 విభాగాల్లో వివిధ క్రీడల్లో ఎంపికలు, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు జట్లను పంపడానికి, వారికి క్రీడా దుస్తులు అందించడానికి, పోటీల నిర్వహణకు రూ. 8.40 కోట్ల బడ్జెట్‌ను ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు కేటాయించారు. అండర్–19 విభాగంలో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19 కార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తారు. అండర్–19 విభాగంలో హాకీ, జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్, లాన్‌టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి పోటీలను ఈ ఏడాది నిర్వహించారు. దీంతో పాటు దాదాపు 34 క్రీడాంశాల్లో బాలుర, బాలికల జట్లు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అయితే అండర్–14, 17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులకు రవాణా ఖర్చుల నిమిత్తం ముందుగానే డబ్బులు చెల్లిస్తుండగా, అండర్–19 విభాగంలో విద్యార్థులకు ఇవ్వడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న క్రీడాకారులు ఎక్కువ మంది ఈ విభాగంలో ఎంపిక కావడంతో సొంత ఖర్చులతో హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జూనియర్ కళాశాలల్లో ఎంపికైన క్రీడాకారులకు కళాశాల స్పెషల్ ఫీజు నుంచి రవాణా ఖర్చులు అందించాలని ఆదేశాలు ఉన్నా చాలా కళాశాలల్లో నిధులు అందించడం లేదనే వాదన వినిపిస్తుంది. జిల్లాలో 50 మంది జూనియర్ కళాశాల పీడీలకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీనిపై అండర్–19 విభాగం కార్యదర్శి శిరామకృష్ణను వివరణ కోరగా ఈ ఏడాది ఈ ఎంపికలు పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోందని, క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ముందుగానే రవాణా భత్యాలు చెల్లించాలని కోరామన్నారు.

అబుదాబిలో సఖినేటిపల్లిపాలెం వాసి మృతి


నేతల విద్యాసాగర్ (ఫైల్)

సఖినేటిపల్లి: ఉపాధి నిమిత్తం దేశం కాని దేశం వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సఖినేటిపల్లి పాలేనికి చెందిన నేతల విద్యాసాగర్ (41) అబుదాబికి ఉపాధి రీత్యా కొన్నేళ్ల కిందట వెళ్లాడు. అయితే ఆ దేశంలో ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని విద్యాసాగర్ పని చేస్తున్న కంపెనీ యాజమాన్యం బాధిత కుటుంబ సభ్యులకు తెలిపింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నెల క్రితమే విద్యాసాగర్ స్వగ్రామానికి వచ్చి వెళ్లినట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంతో ఈ ప్రమాదం జరగడంపై కన్నీరు మున్నీరు అవుతున్నారు. అక్కడ అన్ని ప్రక్రియలు పూర్తయిన తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి పంపిస్తామని కంపెనీ యాజమాన్యం తెలిపిందని కుటుంబ సభ్యులు వివరించారు. విద్యాసాగర్ తండ్రి వసంతరెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.

ఆనంద సాగరం


ఉప్పాడ తీరంలో పర్యాటకుల సందడి

- ఉప్పాడకు పోటెత్తిన సందర్శకులు
- ఎటు చూసినా వన సమారాధనలు

కొత్తపల్లి: సాగర తీరం సందర్శకులతో సందడిగా మారింది.. సముద్రపు అలలు ఒకపక్క, కేరింతల మధ్య పర్యాటకులు మరోపక్క ఆనందం ఎగసిపడింది.. వన భోజనాలు, పర్యాటకుల సందడితో ఆదివారం ఉప్పాడ సాగర తీరం కిటకిటలాడింది. కార్తిక మాసం రెండు, మూడు ఆదివారాల కంటే ఈ వారం తాకిడి పెరిగింది. ఎటు చూసినా వన భోజనాలు, కడలి కెరటాల్లో కేరింతలే కనిపించాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సముద్ర స్నానాలు చేశారు. ఇసుక తిన్నెల్లో డ్యాన్స్ వేశారు. కబడ్డీ, రోప్ ఆటలతో ఉల్లాసంగా గడిపారు. తీరం సమీపంలో సర్వే తోటలు లేకపోవడంతో ఆయా సెంటర్లలో పర్యాటకులు వచ్చిన వాహనాల్లోనే వన భోజనాలు ఆరగించారు. తీరంలో మోటార్ సైకిళ్లతో యువకులు విన్యాసాలు చేశారు. కొత్తపల్లి మండల గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాలతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. అంతేకాకుండా తుని సమీపంలో తలుపులమ్మ తల్లి లోవ అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. తీరంలో ఎక్కడా ఎటువంటి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు నీరు అందుబాటులో లేక ఇక్కట్లు పడ్డారు. ఉప్పాడ తీర ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

గోదావరిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


బల్లిపాడు ఓపెన్ రీచ్‌లో గోదావరి నదిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తాళ్లపూడి (కొవ్వూరు): బల్లిపాడు ఓపెన్ రీచ్‌లో గోదావరిలోకి గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన మేణ్ని సుధాకర్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు దూసుకెళ్లింది. డ్రైవర్ ట్రాక్టర్‌ను న్యూటర్ చేసి గోదావరి ఒడ్డున పార్కింగ్ చేసి వీఆర్వో సుందర రావు వద్ద పత్రాలు చూపడానికి వెళ్లారు. ఆ సమయంలో ట్రాక్టర్ వెనక్కి దొర్లుకుంటూ వెళ్లి నదిలోకి దూసుకుపోయింది. ట్రాక్టర్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ పది అడుగుల లోతులోకి వెళ్లిపోయింది. అనంతరం క్రేన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

